07012025-DIS-04_Layout 1 1/7/2025 2:23 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# కాంగ్రెస్ మరో మోసం

నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది.. అన్న సామెత చందంగా తయారైంది కాంగ్రెస్ రైతు భరోసా వ్యవహారం. అన్నదాతను ఊరించి ఊరించి చివరకు చేతికి దక్కని పంటలా ఉసూరుమనిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ చెయ్యిచ్చిన హామీల జాబితాలో రైతు భరోసా కూడా చేరిపోయింది. ఇప్పటికే రైతులు కాంగ్రెస్ తీరుతో విసిగిపోయారు. రుణమాఫీ తతంగం చూశారు. అరకొరగా అమలు చేయడంతో అదొక ప్రహసనంలా తయారైంది. దెబ్బ మీద దెబ్బలా భరోసా కోతలు వచ్చిపడ్డాయి. రూ.15 వేలు అని చెప్పి రూ.12 వేలే ఇస్తామని చావు కబురు చల్లగా చెప్పింది రేవంత్ సర్కారు. ఇదే పెద్ద ధోకా అనుకుంటే లబ్ధిదారులను తగ్గించేందుకు అర్హతల పేరిట వేసే కోత అతిపెద్ద ధోకా. రాష్ట్రంలో సాగుయోగ్యమైన భూమి 1.48 కోట్ల ఎకరాలుంది. ఆ మొత్తానికి యాసంగిలో రైతుభరోసా ఇవ్వాలంటే రూ.8,880 కోట్లు కావాలి. సాగుచేసిన భూమికే ఇస్తారా? సాగుయోగ్యమైన భూమికీ ఇస్తారా? ఒకవేళ సాగుచేయని భూములను మినహాయిస్తే అందులో సగమే చెల్లిస్తారు. హామీయే కదా ఇచ్చేస్తే పోలేదా అన్నట్టు కౌల్దార్లకూ ఇస్తామన్నారు. ఇప్పటిదాకా ఎలా ఇస్తారో తేల లేదు. ఇలాంటి అంశాలపై సర్కారు నుంచి స్పష్టత లేకపోవడం మరో సమస్య. సర్కారు పెద్దలు తలోదారిగా, పూటకోమాట మాట్లాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారు. తీవ్ర నిరాశ చెందిన రైతులు ప్రభుత్వంపై ధ్వజమెత్తుతున్నారు. ప్రజల కోసం విపక్ష బీఆర్ఎస్ ఉద్యమాల బాట పడితే అరెస్టుల పేరిట పోలీసు నిర్బంధాన్ని అమలు చేయడం విస్మయం కలిగిస్తున్నది.

అధికారం చేజిక్కించుకునేందుకు అలవికాని హామీలిచ్చారు. అందరికీ అన్నీ అన్నారు. అరచేతిలో స్వర్గం చూపించారు. హామీలంటే నమ్మరేమోనని గ్యారెంటీ అనే మాటను అరువు తెచ్చుకున్నారు. అక్కడికి హామీ అనేది ఏదో సంతలో సరుకైనట్టు. అయితే ఇప్పుడు గ్యారెంటీకే వారెంటీ లేకుండా పోయింది. 420 హామీలను అమలు చేయాలంటే రాష్ట్ర బడ్జెట్ ఏమూలలకూ సరిపోదని అప్పట్లోనే ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. మాయదారి మాటలకు పడిపోవద్దని అప్పటి సీఎం కేసీఆర్ ఎన్నికల సభల్లో పదేపదే హెచ్చరించారు. కానీ ఫలితం లేకపోయింది. అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి హామీల ఎగవేత కోసం వేయని ఎత్తు లేదు, చేయని కసరత్తు లేదు. వాయిదాలు, కోతలతో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నది. ఉచిత వంటగ్యాస్, కరెంటు హామీల గురించి సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ అవీ అర్ధసత్యాలే.

ఆర్టీసీని పణంగా పెట్టి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేస్తున్నారు. మిగిలిన హామీలను ఒకటి తర్వాత ఒకటిగా తుస్సుమనిపిస్తున్నారు. ఉద్యోగాల కల్పన కలగానే మిగిలిపోయింది. ఇదివరకటి సర్కారు నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ తతంగమంతా పూర్తిచేసిన ఉద్యోగాలకే నియామక పత్రాలు అట్టహాసంగా అందజేసి జబ్బలు చరుచుకున్నారు. అవ్వలకు, తాతలకు వృద్ధాప్య పింఛన్ రూ. 2016 నుంచి రూ. 4 వేలకు పెంచుతామన్నారు. పైనున్న పదహారు కోతపెట్టి రెండు వేలే ఇస్తున్నారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం కానుకగా ఇస్తామన్నారు. తులం కాకిబంగారం కూడా ఇవ్వడం లేదు. విద్యార్థినులకు స్కూటీ ఇస్తామన్నారు. కనీసం సైకిల్ కూడా ఇవ్వడంలేదు. నమ్మి మోసపోయాం.. ఇప్పుడు గోస పడుతున్నాం అని రైతులే కాదు ప్రజలందరూ వాపోతున్నారు. నమ్మితేనే మోసం చేస్తాం.. నమ్మకపోతే ఎలా చేస్తామని కాంగ్రెస్ పెద్దలు గడుసుగా వాదిస్తారేమో!

# కాంగ్రెస్ కలల బేహారి పాలన

**భారత్ వంటి వర్ధమాన సమాజాల్లో ఎక్కడైనా సరే సామాన్య ప్రజల అవసరాలు, కోరికలు రెండు విధాలుగా ఉంటాయి. ఒకటి, కనీసమైన నిత్య జీవితావసరాలు తీరడం. రెండు, ఆ స్థితి నుంచి మరొక అడుగు ముందుకు వేయగలగడం. అలా ఒక చిన్న ముందడుగు అయినా వేయగలగాలని కోరుకున్నప్పుడు అది వారికి కలలుగనే దశ అవుతుంది.**



**టంకశాల అశోక్**

సామాన్యుల కలలు ఏమిటో పసిగట్టగలిగి, వాటిని తాము తీర్చగలమని వాగ్దానం చేస్తూ, వారి ఓట్లను సంపాదించి అధికారానికి రావడం వరకు ఆక్షేపించవలసింది ఉండదు. అయితే, ఆ విధమైన కలలను తీర్చాలంటే ఆ పార్టీకి చిత్తశుద్ధి, నిజాయితీ ఉండాలి. అలా కాకుండా కేవలం అధికారం కోసమే ఆ వాగ్దానాలు చేసి, కలలను మాత్రం తీర్చకపోవడం కలల బేహారితనం అవుతుంది. ప్రస్తుతం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అటువంటి బేహారిగానే వ్యవహరిస్తున్నది.

1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు కనీస అవసరాల కోసం సామాన్యులు పరితపించారు. సుదీర్ఘ కాలం ఫ్యూడల్ వ్యవస్థలలో, వలస పాలనలో మగ్గినదాని ఫలితంగా ఏర్పడిన పేదరికంలో అత్యధికులకు తిండి, బట్ట, నివాసం, కనీస వైద్య సదుపాయాలు, ప్రాథమిక స్థాయి విద్య, చేసేందుకు కూలి పనుల ఉపాధి అయినా అందుబాటులో ఉండేవి కావు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు వెనుకబడి ఉండగా, ఆ కారణంగా వర్తక వ్యాపార రంగం కూడా అందుకు తగినట్టే ఉండేది. ఈ పేదరికపు దశను పేదల అర్ధాకలి, ఆకలి చావులు ప్రతిఫలించేవి. అటువంటి దశ నుంచి వీలైనంత త్వరగా బయట పడేందుకు అవసరమైన సహజ వనరులు, అవకాశాలు ఉండినప్పటికీ ప్రభుత్వాల వైఫల్యం కారణంగా, విధానపరమైన లోపాలు, ఆచరణలో నిజాయతీ లేమి, పాలకుల స్వార్థం కారణంగా ఆ స్థితి నుంచి ప్రజలు బయటపడేందుకు దాదాపు 50 సంవత్సరాలు పట్టింది.

ఆ విధంగా 20వ శతాబ్దం చివరకు వచ్చేసరికి సామాన్యులకు పైన పేర్కొన్న కనీస అవసరాల దశ పూర్తిగా కాకున్నా చాలా వరకు గడిచిపోయింది. వాస్తవానికి ఆ మొదటి దశలోనూ రాజకీయ పార్టీలు అధికారం కోసం హామీలివ్వడం, మ్యానిఫెస్టోలు ప్రకటించడం, విధానపరమైన ప్రకటనలు, చట్టాలు చేయడం ఉండేది. కానీ, అమలు కావడం అరకొరగా, ప్రజలను మోసగించడం ఎక్కువగా ఉండేది. ఆ కాలంలో సామాన్యుల కలలనేవి కనీస జీవితావసరాలను పొందడానికి మాత్రమే పరిమితమై ఉండేవి. అప్పటి దృష్టితో ఆలోచించినట్టయితే అది కూడా రాజకీయ పార్టీల కలల బేహారితనమే. ఆ కాలమంతా అత్యధిక భాగం పాలించింది కాంగ్రెస్ అయినందున, ఆ పార్టీ




ప్రధానమైన బేహారి కావడం, ప్రజలను మోసగించడం, అందుకు పర్యవసానంగా తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని కోల్పోయి ఇక తిరుగులేని క్షీణ దశలోకి ప్రవేశించడం జరిగిపోయాయి. ఆ శూన్యాన్ని ఇతరులు ఆక్రమిస్తూ పోయారు. ఒక విషయం గుర్తు చేస్తే ఎవరైనా నమ్ముతారో, లేదో తెలియదు కానీ, 1952 నాటి మొదటి ఎన్నికల తర్వాత 1957లో జరిగిన రెండవ ఎన్నికల్లోనే కాంగ్రెస్ పార్టీ పలు రాష్ర్టాల్లో ఓట్లు, సీట్లు, కేరళలో అధికారాన్ని సైతం కోల్పోయినప్పుడు అప్పటి ప్రధాని నెహ్రూ అన్నదేమిటి? పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే సామాన్యులు మరింత చైతన్యవంతులై తమ ఓటు హక్కును వినియోగించుకుంటూ, కాంగ్రెస్‌ను పక్కకు తోసివేసి తమ దారిలో తాము ముందుకు సాగిపోగలరని వర్కింగ్ కమిటీ సమావేశంలోనే హెచ్చరించారు. ఆ శతాబ్దం ముగుస్తున్న దశకే కాంగ్రెస్ పరిస్థితి క్రమంగా ఏమైందో తెలిసిందే.

**అప్పటి సామాన్యుల ఆశలు, కలలు కూడా కనీస అవసరాలైనా తీరని దుస్థితి నుంచి బయటపడటం. తర్వాత 20వ శతాబ్దం ముగుస్తుండిన కాలం నుంచి మొదలుకొని ప్రస్తుత 21వ శతాబ్దం కూడా ప్రవేశించినప్పటి నుంచి దేశ ఆర్థిక స్థితిగతులు క్రమంగా మెరుగుపడడం మొదలైంది. అందుకు అనుగుణంగా సామాన్యుల జీవితాలు కూడా నెమ్మదిగా బాగుపడుతుండగా, పైన పేర్కొన్నటువంటి కనీస జీవితావసరాలు కనీసమైన విధంగా తీరడం మొదలైంది. ఆ సరికి స్వాతంత్ర్యానంతరపు మూడవ తరం ఉనికిలోకి వచ్చింది.**

అలా ఒకవైపున కనీస అవసరాలు తీరుతుండటం, మరొకవైపు సరికొత్త తరాలు ఉనికిలోకి రావడంతో సామాన్య ప్రజలకు జీవితంలో ఒక అడుగు ముందుకు వేయాలన్న కోరికలు, లేదా కలలు, సహజమైన రీతిలో ఆరంభమయ్యాయి. వారి మొదటి దశ కోరికలు, అవసరాల ఆధారంగా కలల బేహారులుగా మారిన రాజకీయ పార్టీలు తిరిగి రెండవ దశలోనూ కలల బేహారుల అవతారంలో తమ నాటకంలో రెండవ అంకాన్ని ప్రారంభించారు. అంతే తప్ప, నెహ్రూ హెచ్చరికల నుంచి గుణపాఠం నేర్చుకోలేదు. ప్రస్తుతం మనం తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి చూస్తున్నది సరిగ్గా ఇదే. ఎన్నికల ప్రచారం, మ్యానిఫెస్టో, వివిధ డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల బాండ్ పేపర్లు, కాంగ్రెస్ జాతీయ నేతలు సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గేల వ్యక్తిగత హామీల నుంచి మొదలుకొని కనిపిస్తున్నది యావత్తూ కలల బేహారి చాణక్యమే. మోసకారితనమే. అధికారంలోకి వచ్చి 13 నెలలు పూర్తికావస్తున్నా ఇందులో మార్పు లేదు. రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాల్లో ఏ తరగతిని కదిలించినా వినిపిస్తున్న మాట ఇదే. ఇందులో మరొక దయనీయమైన స్థితి కనిపిస్తున్నది. తాము హామీలతో సృష్టించిన కలల బేహారితనం ప్రజలకు అర్థమైపోయింది. తమకు తామే సృష్టించుకున్న ఆ వలయంలోంచి బయటపడలేకపోతున్న కాంగ్రెస్, వాటి నుంచి దృష్టి మరల్చేందుకు ఎప్పటికప్పుడు మరిన్ని కలలు సృష్టించ బూనుతున్నది. వెనుకటివి నకిలీవని అర్థమైన సామాన్యులు కొత్త నకిలీలపై సహజంగానే పెదవి విరుస్తున్నారు. ఈ ఏడాది అనుభవంతో సర్వసాధారణంగా వినవస్తున్నది ఒకటే. మాటలెక్కువ, చేతలు తక్కువ అని. ఆ ఒక్క మాట చాలు రాష్ట్ర ప్రభుత్వ నేతలు, వారితోపాటు అధిష్ఠాన నాయకత్వం అద్దంలో తమ ముఖం తాము చూసుకునేందుకు. దీనికితోడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని అబద్ధాలతో రికార్డులు సృష్టిస్తున్నారు.

అటు అధిష్ఠానం, ఇటు రాష్ట్ర నాయకులు పదేండ్ల పాటు అధికారాన్ని కోల్పోయి ఒడ్డున పడిన చేపల్లా గిలగిలా కొట్టుకున్నారు. ఈ స్థితిలో కలల బేహారితనపు మోసకారి వ్యూహాలతోనైనా సరే అధికారాన్ని తిరిగి సంపాదించాల్సిన దిక్కుమాలిన స్థితి ఎదురైంది. దీంతో వ్యూహకర్తలను కాంట్రాక్టు చాణక్యులుగా రంగంలోకి తెచ్చి హిమాచల్, కర్ణాటక, తెలంగాణల్లో గట్టెక్కారు. కానీ మూడు చోట్లా ఇప్పుడు విలవిల్లాడుతున్నారు. వారి బాధ హామీలను అమలు చేయలేకపోతున్నామని కాదు, తాము వంచనాపూరిత కలల బేహారులమని ప్రజలకు తెలిసిపోతున్న స్థితిలో మరిన్ని కలలు సృష్టించి ప్రజలను మభ్యపెట్టడం ఎలాగనే. 67 సంవత్సరాల క్రితం పార్టీకి నెహ్రూ చేసిన హెచ్చరిక ఇటువంటి మార్గాన్ని అనుసరించమని మాత్రం కాదు.

ఇక, ఢిల్లీ నాయకత్వం గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. గ్యారెంటీల పల్లీప్యాకెట్లను మసాలా కలిపి పంచిన తర్వాత ఇక ఈ మూడు రాష్ర్టాల ప్రజలకు ముఖం చూపించే ధైర్యం చేయలేకపోతున్నారు. మరీ ముఖ్యంగా ఆ ఎత్తుగడలు హర్యానా, మహారాష్ట్రలలో చిత్తయిపోయిన తర్వాత. అందుకే ఈ ఏడాదికాలంలో ఒక్కసారైనా ఇటు వచ్చి ప్రజలకు ముఖం చూపించలేకపోయారు.



# జడిపిస్తున్న మరో వైరస్

నాన్నా పులి కథ అందరికీ తెలుసు! కానీ ఇప్పుడు అందరం నాన్నా.. వైరస్ కథ చూస్తున్నాం! ప్రపంచంలో ఏదో మూల ఏదో ఒక వైరస్ వ్యాప్తి ఎక్కువ అవగానే మరో ప్రళయం రాబోతుందనే స్థాయిలో సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నది. ముందుగా వైరస్ పుట్టు పూర్వోత్తరాల గురించి తెలుసుకుందాం.

**వైరస్‌లు కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఆవిర్భవించాయి. ఇవన్నీ వ్యాధి కారకాలే. అవి మొక్కల్లో, జంతువుల్లో, మానవుల్లో వ్యాధులను కలిగిస్తుంటాయి. కొన్ని వైరస్‌లు బాక్టీరియాలపైనా దాడి చేస్తాయి. అతిథేయి లేకుండా వైరస్ ప్రత్యుత్పత్తి కొనసాగించలేదు. వైరస్‌ను నిర్జీవజీవిగా వర్ణిస్తారు. దానికి జీవుల లక్షణాలు, నిర్జీవుల లక్షణాలు రెండూ ఉంటాయి. అతిథేయి దేహంలో జీవిగా, బయట నిర్జీవిగా మనుగడ సాగిస్తుంది.**

మానవులలో వైరస్ వ్యాధులు నియోలిథిక్ కాలం నుంచీ ఉన్నాయి. 12 వేల ఏండ్ల క్రితమే వైరస్‌లు మానవుల్లో వ్యాధిని కలిగించాయి. మనిషి పరిణామ క్రమంలో సంఘజీవిగా మారినప్పటి నుంచీ వైరస్ వ్యాధులు వ్యాప్తి చెందడం మొదలయింది. స్మాల్ పాక్స్. మీజిల్స్ అతిప్రాచీనమైన వైరస్ వ్యాధులు. మనుషుల్లో వ్యాధి కారక వైరస్‌లు.. మొదట జంతువుల్లో లేదా పక్షులలో వ్యాధిని కలిగించే వైరస్‌లు (జునోటిక్/ ఏవియన్ వైరస్). 15వ శతాబ్దంలో ఇన్‌ఫ్లుయెంజా, ఫ్లూ వ్యాధులు లక్షలాదిమంది మరణాలకు కారణమయ్యాయి. ఇవే వ్యాధులు 17వ శతాబ్దంలోనూ విస్తృతంగా వ్యాప్తి చెందా యి. 18వ శతాబ్దంలో స్మాల్‌పాక్స్ వైరస్ ప్రపంచవ్యాప్తంగా విలయానికి కారణమైంది. 19వ శతాబ్దంలో వాక్సిన్స్ కనుగొన్న తరువాత స్మాల్‌పాక్స్‌ను అరికట్టగలిగాం. పోలియో, మీజిల్స్, ముంప్స్, రుబెల్లా వంటి వాటి వ్యాప్తిని నివారించగలిగాం. కానీ, కొత్త వైరస్‌లు పుట్టుకొస్తూ మానవాళికి కొత్త సవాళ్లను విసురుతూనే ఉన్నాయి.

మానవ అభివృద్ధి జరిగిన కొద్దీ జీవన విధానంలో మార్పులు వస్తూ ఉన్నాయి. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు, విస్తృత రవాణా సదుపాయాల వంటివి కొత్త వైరస్‌ల ఆవిర్భావం, వ్యాప్తికి కారణం అవుతున్నాయి. మానవాళి ప్రధానంగా జునోటిక్ వైరస్‌లు, ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌లు, అర్బోరి వైరస్‌ల (కీటకాల నుంచి సంక్రమిస్తుంది) వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నది. 20, 21 శతాబ్దంలో ఈ వైరస్‌ల నుంచి అనేక ప్రమాదాలు ఎదుర్కొన్నాం. ఫ్లూను కలగజేసే ఇన్‌ఫ్లుయెంజాను ఉదాహరణగా తీసుకుంటే, 1899లో 2.5 లక్షల మరణాలు, 1918లో స్పానిష్ ఫ్లూగా రూపాంతరం చెంది 5 కోట్ల మరణాలు, 1950లో ఆసియన్ ఫ్లూగా 10 లక్షల మరణాలు, 2009లో స్వైన్ ఫ్లూ రూపంలో అనేక మరణాలకు కారణమైంది. అలాగే, ఎల్లో ఫీవర్ వైరస్ ప్రతి దశాబ్దంలోనూ విజృంభిస్తున్నది. 19వ శతాబ్దం మొదట్లో పుట్టుకొచ్చిన హెపటైటిస్ వైరస్ ఇప్పటికీ వ్యాధులను కలిగిస్తూనే ఉన్నది. ఇలా కొన్ని వేల సంవత్సరాలుగా వైరస్‌తో మానవుడు పోరు సలుపుతూనే ఉన్నాడు.

**ప్రపంచం ప్రస్తుతం జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందే శ్వాసకోశ వ్యాధికారక వైరస్‌ల నుంచి పెను ప్రమాదం ఎదుర్కొంటున్నది. అతి తీవ్ర శ్వాసకోశ వ్యాధులు (సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్) మానవులకు చాలా ప్రమాదకరంగా ఉంటున్నాయి. గతంలో వచ్చిన 'సార్స్','మెర్స్'తో పాటు 2019 లో వచ్చిన కొవిడ్-19 ప్రపంచాన్ని చిన్నాభిన్నం చేసింది. కోట్లాది మంది మృతికి కారణమైంది. ఈ వైరస్ ప్రభావం నుంచి ప్రపంచం ఇప్పుడిపుడే కోలుకుంటున్నది.**

ప్రస్తుత కాలంలో ఏ కొత్త వైరస్ పేరు విన్నా మానవాళి ఆందోళనకు గురి అవుతున్నది. ఇప్పుడు చైనాలో మరో వైరస్ హ్యూమన్ మెటాన్యూమోనిక్ వైరస్ (హెచ్ఎంపీవీ) కేసులు పెరగ్గానే ప్రపంచంలో అలజడి మొదలయింది. కానీ ఇది చాలా పాత వైరస్. 2001 లోనే దీనిని డచ్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రపంచంలో అనేక దేశాలలో ఈ వైరస్ సోకినప్పటికీ మరణాలు ఎక్కువగా లేవు. ఎండమిక్ గానే ఉంది. ప్రస్తుతం కూడా అదే స్థాయిలో ఉంది.

**భారతదేశంలో కూడా వేర్వేరు ప్రాంతాల్లో హెచ్ఎంపీవీ వ్యాప్తిని 2008 నుంచి 2023 వరకు గమనించారు. అయితే, ఇక్కడ కూడా భారీ నష్టాన్ని ఏమీ కలిగించలేదు. ప్రధానంగా ఐదేండ్ల లోపు పిల్లలు, వయోధికులు, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, శ్వాస సంబంధ వ్యాధులు ఉన్నవారిలో ఈ వైరస్ ప్రభావం ఎక్కువ. మిగిలిన వారిలో కేవలం జలుబు వంటి లక్షణాలు కనిపిస్తాయి.**

ఈ వైరస్ యొక్క వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ గురించి జనబాహుళ్యంలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా కొత్త వైరస్‌లు పుట్టుకొస్తూనే ఉంటాయి. మ్యుటేషన్స్, జెనెటిక్ షిఫ్ట్, స్పీసిస్ జంప్ వల్ల ఇలా జరుగుతుంది. ప్రతీ కొత్త వైరస్ ప్రమాదభరితం కాదు. కాకపోతే, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆందోళన అసలే అవసరం లేదు. సోషల్ మీడియా పుకార్లతో 'నాన్నా! వైరస్' స్థితికి రావద్దు.



**డాక్టర్ అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి**
**మైక్రోబయాలజిస్ట్, 99481 06198**

# దగాకోరు ప్రభుత్వం- దిక్కుమాలిన పాలన

**'ముందు దగా వెనుక దగా కుడి ఎడమల దగా దగా'.. మహా కవి శ్రీశ్రీ చెప్పిన మాటలు రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి అద్దం పడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో అధికారంలోకి రాగానే రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, రైతు కూలీలకు సాయం, కౌలు రైతులకు సాయం, ప్రతి పంటకు బోనస్ లాంటి ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చింది.**



**జి.దేవీప్రసాద్ రావు**

ఏడాది కాలంగా రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గంగా ఉన్నది. రూ. 2 లక్షల రుణమాఫీని డిసెంబర్ 9న మొదటి సంతకంతో ప్రారంభిస్తానని చెప్పి మాట తప్పి రేవంత్ సర్కారు మోసం చేసింది. రుణమాఫీపై నాన్చివేత వైఖరిని బీఆర్ఎస్ గట్టిగా ఎండగట్టడంతో దిగొచ్చిన ప్రభుత్వం ఆగస్టు 15 లోగా పూర్తి చేస్తామని రాష్ట్రంలోని అందరి దేవుళ్లపైనా ఒట్టు వేసి ప్రజల సెంటిమెంట్‌ను వాడుకొని పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కింది. హరీశ్‌రావు సవాలు తర్వాత రుణమాఫీకి సవాలక్ష కండిషన్లు పెట్టడంతోపాటు రూ. 31 వేల కోట్లకు కుదించి, బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లు ప్రతిపాదించి కేవలం రూ. 20.16 వేల కోట్లను 25.35 లక్షల రైతులకు మాత్రమే మాఫీచేసి రుణమాఫీ అయిపోయిందని కాంగ్రెస్ దబాయిస్తున్నది. ఇక, రెండో మోసం బోనస్. వరి, మొక్కజొన్న, కందులు, సోయాబీన్, పత్తి, మిర్చి, పసుపు, ఎర్రజొన్న, చెరకు, జొన్నలు వంటి 10 పంటలకు మద్దతు ధరకు అదనంగా బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. ఆ హామీ బోగస్‌గా మారింది. తొలుత అన్ని వడ్లకు ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్నాలకేనని కోతలు పెట్టింది. వానకాలంలో 156 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే, ప్రభుత్వం కొనుగోలు చేసింది 50 లక్షల టన్నులే. పండిన ధాన్యంలో 30 శాతం కొనుగోలు చేసి బోనస్ అమలు చేశామని గొప్పలు చెప్పుకున్నది.


రైతు భరోసా రైతులకు తీరని వ్యథగా మారింది. ఎకరానికి రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి రూ. 15 వేల చొప్పున పెట్టుబడి సాయంగా ఇస్తామని హామీ ఇచ్చి 2024 మొత్తం ఇవ్వకుండానే ఎగ్గొట్టింది. 2023లో యాసంగి అక్టోబర్‌లో అప్పటి కేటీఆర్ ప్రభుత్వం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు చేసి ఇవ్వకుండా అడ్డుకున్నది. ఏడాదిగా రెండు పంటలకు రైతుభరోసా ఇవ్వలేదు. ఇప్పుడేమో ఎకరానికి రూ. 12 వేలు మాత్రమే, అది కూడా సాగు యోగ్యత కలిగిన భూమికి మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చెప్తున్నది. కేసీఆర్ తీసుకున్న అనేక నిర్ణయాల వల్ల రాష్ట్రంలో వానకాలంలో సాగునీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో 136 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. అయితే, యాసంగిలో నీటి కొరతతో సాగు 60 లక్షల ఎకరాలకు మాత్రమే పరిమితమై పోయింది. మిగిలిన 76 లక్షల ఎకరాలు సాగు యోగ్యమైనా నీళ్ల కొరతతో సాగు కాలేదు. కాబట్టి ప్రభుత్వం 136 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇస్తుందా? లేదంటే 60 లక్షల ఎకరాలకు మాత్రమే ఇచ్చి 76 లక్షలకు ఎగ్గొడుతుందా? అన్నది చూడాలి. 2024లో ఎకరానికి రూ.17,500 చొప్పున రైతులకు బాకీపడిన సొమ్మును ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించిన కేటీఆర్ నోరు మూయించడానికి, నిర్బంధించడానికి కుట్రలకు తెరలేపారు.



వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని కాంగ్రెస్ మరో హామీనిచ్చినా ఇప్పటి వరకు భూమి లేని రైతు కూలీలు ఎంతమంది ఉన్నారో తెలుసుకొనే ప్రయత్నం కూడా చేయలేదు. ఇచ్చిన హామీని అమలు చేయాలన్న చిత్తశుద్ధి లేకపోవడమే ఈ పరిస్థితికి కారణం. ఆరు గ్యారెంటీల్లో ముఖ్యమైన అంశం పట్ల కూడా కనీసం ఆలోచన లేకపోవడం నిరుపేదలపై కాంగ్రెస్‌కు ఉన్న కపట ప్రేమకు నిదర్శనం. కూలీలకు రూ. 12 వేలు ఇస్తామని డిసెంబర్ 28న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క హడావుడిగా ప్రకటించారు. దీంతో సీఎంకు కోపం వచ్చినట్టుగా ఉంది. అందుకే రైతు కూలీ పథకాన్ని జనవరి 26 తర్వాత అమలు చేయాలని నిర్ణయించారు. దీనికి ఎలాంటి విధివిధానాలు ప్రకటించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని హామీనిచ్చిన కాంగ్రెస్ ఏడాది దాటినా ఒక్క దానినీ సంపూర్ణంగా అమలు చేయలేదు. ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యమకారులకు ఇంటి స్థలం, మహిళలకు రూ. 2,500 భృతి, రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు మొదలే కాలేదు. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం జాడే లేదు. 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, అమరవీరుల కుటుంబాలకు పెన్షన్, ఉద్యోగులకు పీఆర్సీ, డీఏ, రిటైర్ అయిన ఉద్యోగులకు ప్రయోజనాలు, అంగన్వాడీ, ఆశ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల జీతాల పెంపు, కామారెడ్డి, వరంగల్ డిక్లరేషన్ మొదలగునవి కనుచూపు మేరలో లేవు కూడా.

కేసీఆర్ ప్రభుత్వం దరఖాస్తు, దస్కత్ లేకుండా సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా కృషి చేసింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యమ సమయంలో గుర్తించిన కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రజల ఆకాంక్షలనే ప్రభుత్వ అజెండాగా మార్చి పదేండ్లు వికాసం పైనే దృష్టిసారించి రాష్ట్రాన్ని పరుగులు పెట్టించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే వికాసాన్ని విధ్వంసంగా మార్చింది. కేసీఆర్ ఆనవాళ్లను తుడిచేస్తామని చెప్తూ ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నది. చివరికి తెలంగాణ అస్తిత్వంపై చేసిన వికృత రాజకీయం వికటించి తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురైంది. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు, బతుకమ్మ మాయం, కాకతీయ, చార్మినార్ చిహ్నాల మార్పు వంటి వాటిని బీఆర్ఎస్ వ్యతిరేకులు సైతం జీర్ణించుకోలేకపోయారు. ఇటీవల కేటీఆర్ చెప్పినట్టు ప్రతిరోజూ ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయాల్సిన స్థితిని రేవంత్‌రెడ్డి స్వయంగా కల్పిస్తున్నారు. ప్రతిపక్ష పాత్రను సమర్థంగా పోషించి ప్రజల పక్షాన నిలిచి రాజీలేని పోరాటాలు చేసి విజయం సాధించడం బీఆర్ఎస్ ముందున్న కర్తవ్యం. నిర్బంధాలు, అరెస్టులు, జైళ్లు, ఉద్యమాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు. 14 ఏండ్లు కేసీఆర్ నాయకత్వంలో పోరాడి సుదీర్ఘ లక్ష్యాన్ని ఛేదించి జాతీయ పార్టీల మనుగడకే ప్రమాద ఘంటికలు మోగించిన బీఆర్ఎస్ అన్ని అడ్డంకులను ఎదుర్కొని అజేయంగా విజయం వైపు అడుగులు వేస్తున్నది.

(వ్యాసకర్త: రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్)




# ఓటేస్తే బాస్‌లు అయిపోరు



**కేవలం నాకు ఓటు వేసి గెలిపించినంత మాత్రాన మీరు నాకు యజమానులో, బాస్‌లో అయిపోరు. ఓటు వేసినందుకు అర్థం అదికాదు. మీరు నాకు బాస్ అయినట్టు కాదు. మీరిప్పుడు నన్ను రైతు కూలీని చేస్తరా ఏంటి?**

**- అజిత్ పవార్**, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి